# ఆడపడుచులక్ష్మి

ఆదివారం

ఉదయం పదిగంటలు కావస్తుంది. వేడివేడిగావున్న వుప్మాతిని కాఫీతాగి స్నానం ముగించుకోకుండా దినపత్రిక తిరగేస్తు కూర్చున్నాను. శ్రీవారికి శలవురోజు అయితే నాకు వంటపని వుండదు. కనుకనే విశ్రాంతి. ఈ విశ్రాంతి రోజుల్లో వంటాకాదు వంటగదిలో అడుగు పెట్టాలంటేనే చికాకు, శ్రీవారు తన పాకప్రావీణ్యాన్ని అమోఘంగా చూపిస్తుంటారు. ఈ రోజు టిఫెను తర్వాత వంట యేమేం చేయాలో చెప్పి పేపరు చదవటంలో మునిగిపోయాను. మా శ్రీవారు బహుమంచివారు కనుకనే తన శలవు రోజుని నాకు విశ్రాంతిదినంగా చేస్తు వుంటారు. ఇలా యేమగాళ్ళు చేతులు కాల్చుకుంటారు చెప్పండి.

"ఎం.ఏ చదివిన మీరు యే వుద్యోగంలో అయినా చేరకుండా ఇలా ఇంట్లో కూర్చుంటే యేం తోస్తుందే" అని నా స్నేహితులు కొందరంటూ వుంటారు.

రెండువేల జీతం తెచ్చే భర్తవుండగా వుద్యోగం చేయవల్సిన ఖర్మ నాకేమిటీ. 'భర్త' అంటే భరించేవారు అనే కదూ అర్థం. స్త్రీ వుద్యోగం చేయటం అంటే యెంతకష్టం. రెండు మెతుకులు తిని టిఫెను డబ్బా పట్టుకుని వురుకులూ పరుగులతో బస్సుల కోసం పరిగెత్తే ఆడవాళ్ళ అవస్థలు నాకు తెల్సు. అందుకే 'వుద్యోగం వద్దు' అనుకుని యెంచక్కా ఆరు గంటలకి లేచి తాపీగా స్నానం ముగించుకుని యేదో ఒకటి వండి పెట్టి

శ్రీవారిని ఆఫీసుకు పంపేస్తే తర్వాతంతా విశ్రాంతే. పదింటికి భోజనం చేసి కొత్తగా రిలీజైన యే పిక్చర్‌కో మార్నింగ్ షోకో చెక్కేసి వచ్చి టిఫెనూ కాఫీ తీసుకుని ఇంక ఇరుగమ్మకీ పొరుగమ్మకీ చూసిన సినిమా గురించి చెప్పటంలో వుండే 'థ్రిల్' నాలాంటి వాళ్ళకే అర్థమవుతుంది. అందుకే పేపరులో చూస్తున్నాను యే థియేటర్‌లో యే సినిమా వుందోనని. ఇంతలో పక్కింటి పద్మాక్షి కేక వినిపించింది.

'వదినగారూ ఓ వదినగారూ' అని

పేపరు మడిచి పక్కన పడేసి ప్రహరీ గోడ దగ్గరకి వెళ్ళాను. పద్మాక్షి పొట్టిగా లావుగా మిగలముగ్గిన జామపండు రంగులో వుంటుంది. ఆవిడ నా సినిమా ఫ్రెండ్. మేమిద్దరం కలిసి యెక్కడికి వెళ్ళాలన్నా రిక్షాని పిలిస్తే ఆ రిక్షావాలా ఆవిడని చూసి 'చస్తాను' అనబోయినవాడు 'రానమ్మగారూ' అనేస్తాడు.

ఆవిడ శరీరం 'భారీ ఆయినా మనసు వెన్నలాంటిది. అయినా ఆవిడతోబాటు నడవటం అంటే నాకు తగని భయం. యెందుకంటే ఆవిడ యెదురుగా వచ్చే వాహనాలని చూసుకోదు. రోడ్డుమీద పడేసిన అరటి తొక్కలని అసలే చూసుకోదు. అరటితొక్కమీద కాలేసి కాలుజారి పడబోవటం ఆవిడని పట్టుకోబోయి నేనూ పడటం మా ఇద్దరినీ చుట్టూవున్న వాళ్ళు చూసి జాలిపడటం 'అయ్యో' అంటూ సానుభూతి చూపుతునే దొంగ నవ్వు నవ్వబోయి పెదవులు బిగబట్టి ఆ నవ్వుని మింగేయటం. అలాంటి వాళ్ళని చూస్తు నేను కోపం తెచ్చుకోవటం మామూలు అయిపోయింది. నిన్నటికి నిన్న ఇలాగే జరిగి నేనూ ఆవిడని లేవదీయబోయి పడిపోవటం ఆవిడ లేవలేకలేస్తు 'అయ్యో వదినగారూ నా అజాగ్రత్తతో మిమ్మల్ని ఇబ్బంది పెట్టేస్తున్నాను అని తెగ బాధపడిపోయింది. ఇందుకేనేమో ఆవిడంటే నాకు మరీమరీ ఇష్టం. ఇందువల్లనే మా ఇద్దరి సినిమా స్నేహం మూడుపువ్వులూ ఆరుకాయాలూగా అభివృద్ధి చెందుతూవుంది. పద్మాక్షి మిగతా ఆడవాళ్ళలా డబ్బు ఖర్చుకి వెనకాడదు. అంటే సినిమాకిగాను అయిన ఖర్చులో సగం భరిస్తుంది. చల్లగా తియ్యగా కబుర్లు చెప్తూ

వుంటుంది. వీటన్నింటికీ మించి ఆవిడలో ఓ గొప్పదనంవుంది. యెప్పుడూ నవ్వుతుండే ఆవిడ ముఖానికి ఆ నవ్వే ఓ విథమైన అందాన్ని ఇస్తోంది అన్న విషయం నాకు చాలా రోజులవరకూ అర్థం కాలేదు. అర్థం అయిన తర్వాత ఆవిడంటే ఆత్మీయతాభావం పెరిగిపోసాగింది. ఇందుకే కాబోలు మా స్నేహానికి అయిదేళ్ళ వయసువచ్చింది. గోడ దగ్గరికి వెళ్ళి అడిగాను.

"నిన్నటి కాలు నొప్పి తగ్గిందా వదినగారూ" అని–

"తగ్గలేదు పైగా యెక్కువైంది" అంటూ నవ్వింది బాధపడుతూ కూడా నవ్వగల్గటం ఆవిడ ప్రత్యేకత. ఇదే అన్నాను. నా మాటని ఆవిడ పట్టించుకోలేదు. చూడండి వదినగారూ మన మొగుళ్ళికి ఆదివారం నాడు ఆఫీసులకి శలవు అంటూ ఇచ్చింది యెందుకంటారూ"

"భార్యాపిల్లలతో సరదాగా గడపమనీ విశ్రాంతిగా వుండమనీ" ఔనా! అయితే వీళ్ళలో యెందరు చేస్తున్నారంటారు?"

"అందరి సంగతీ మనకెందుకు మన మొగుళ్ళు అక్షరాలా ఆ విషయాన్ని పాటిస్తూన్నారుగా"

"అదేనండి మన తెలివితక్కువ. మనవాళ్ళు మనల్ని వదలటం లేదు కదా మిగతావాళ్ళు యే గంగలో దూకితేనేం అని ఇన్నాళ్ళు కళ్ళు మూసుకుని కూర్చున్నాం. పక్కింటి మంటలు మనిళ్ళ మీదకి వచ్చేశాయి"

"అంటే? నాకేం అర్థం కావటంలేదు"

"కొద్దిగా దగ్గరగా రండి చెప్తాను. ఈ మగాళ్ళు యెంత బరితెగించారో మీకు తెలియదు. ఆదివారం ఒచ్చిందంటే చాలు అవతలింటి అమరేశ్వరిగారి మొగుడు అశ్వమేథయాగానికి వెళ్ళిపోతాడు పక్కింటి పాపారావు ఇల్లుని పేకాట క్లబ్బు చేసేశాడు. ఆయన పెళ్ళాం నీలవేణి ఈ బాధ పడలేక పుట్టింటికి చక్కాపోయింది. అంతే ఆయన ఆఫీసు మానేసి మరీ ఆడేస్తున్నాడు. ఇంతేకాక మన కాలనీలో వున్న మగాళ్ళంతా నిన్న ఓ మీటింగ్ పెట్టి ఆదివారం యేమగాడూ ఇంట్లో వుండకూడదు. యెవరికి కావల్సిన యెంజాయే

మెంట్ వారు వెతుక్కోవాలి. కనుక పేకాట అంటే పడిచచ్చే మీ ఆయన్ని మా ఆయన్నీ కూడా రమ్మని బొట్టు కాటుకాపెట్టి పిల్చుకు వెడుతున్నారు.

ఆవిడ మాటలకి నాకు చికాకు వచ్చింది.

మిగతా మగాళ్ళందరూ అలాంటి పిలుపులకి పరుగులెత్తవచ్చు కానీ. మావారు అలాంటి వారు కాదు అన్నాను కాస్త గర్వంగా.

"అవే అధే .. నమ్మకం మన కొంపలు ముంచుతున్నది. మీ ఆయన ఆఫీసులో పనివున్నదంటు ఇంటికి ఆలశ్యంగా రావటం యెందుకు మావారు నాకు చెప్పారు. ఆయనా ఈయనా కల్సి పేకాట కోసం క్లబ్బుల వెంచేసి యేం యెరగని వాళ్ళలా పిల్లుల్లా రాత్రి పదింటికి ఇళ్ళకి చేరటంకి విషయం అదన్న మాట. అర్థమైందా?"

"నిజంగానా"

"ఇంకా అవనమ్మకమా. వాళ్ళ యేజంట్లు వచ్చి మా ఆయన్ని లాక్కుపోవటమే కాదు అటు చూడండి మీ ఇంటికీ వచ్చారు"

చివ్వున తలతిప్పి చూశాను.

శ్రీవారు వాళ్ళతో వెళ్ళిపోతూ "ప్రభా వంట ఇల్లు చూసుకో...." అంటు మెల్లగా చెప్పటం నా ఒక్కదానికే విన్పించింది. ఈయనకి యెంత ధయిర్యం. అలావెళ్ళి పోవటానికి? అసలీ ధయిర్యం ఎలా వచ్చింది. యెక్కడినుంచి వచ్చింది. వెడుతున్న ఆయనవంక కళ్ళప్పగించి చూసుండిపోయాను.

"చూశారా ఒదినగారూ" అదీ సంగతి.

"ఇప్పుడేం చేయాలి? మెదడుపని చేయక బేలగా అడిగాను"

"ఏం చేయటం యేమిటి, కొండంత అండగా మన అన్నగారుండగా ఆడబడుచుల సుఖసంతోషాలే మాకు. శ్రీరామరక్ష అని అనుక్షణం ఆయన

కథా నిలయం
3533



అంటుండగా మనకి దిగులేమిటీ పద్మాక్షి వూపిరి సలపనట్లుగా చెప్పుకు పోతూవుంది.

"అన్నగారూ అని క్షణం ఆలోచించి అర్ధమైనట్లు చూస్తు ఔను సుమా" అన్నాను.

''ఆ.... అలా పాయింట్లోకి రండి. నిన్న సాయంకాలం మనం మార్నింగ్‌షో నించి వచ్చిన తర్వాత అన్నమాట. మహిళా సమాజంనుంచి పిలుపువస్తే కుంటుస్తునే వెళ్ళాను. అన్నగారి దగ్గరకి వెళ్ళి ఈ మగాళ్ళ విషయం ఆయన చెవులోవేసి పరిష్కారం చెప్పమని అడుగుదాం అని తీర్మానం చేద్దాం. కనుక మన సమాజం మెంబర్సే కాకుండా ఇంకా ఇంకా అందరినీ తీసుకురండి అని సెక్రటరీ చెప్పింది కనుక నేవెళుతున్నాను. మీరూ వస్తానంటే తీసుకువెడతాను. ఏమంటారు!"

నేనెప్పుడూ మహిళా సమాజాలకి దూరంగా ఉంటాను. కానీ ఇప్పుడు శ్రీవారు చేసిన పనికి ఒళ్ళు మండిపోతువుంది.

'నేనూ వస్తాను వెళ్ళేప్పుడు పిలవండి' అనేసి ఇంట్లోకి వచ్చేశాను

* * * *

ఇంట్లోకి వచ్చానే కానీ మనసుకి శాంతిగాలేదు. వంట ఇల్లు చూస్తుంటే వెర్రెక్కిపోయేలా వుంది. కూరలు సగం తరిగిఅలాగే వది లేసి వున్నాయి. పాలగిన్నె మీద మూతలేదు. పంచదార ఒలికిన చోట యెర్రచీమలు చేరాయి. కాఫీ తాగిన గ్లాసులు యెండిపోయి వున్నాయి. ఉదయం చేసిన వుప్మా మరో ఇద్దరికి సరిపోయేంతగా మిగిలి మూత లేకుండా వుంది. ఇదంతా చూస్తుంటే బ్లడ్‌ప్లషర్ వచ్చేస్తోంది.

యెవరో వచ్చి పిలిస్తే ఈ మనిషి గొర్రెపొట్టేలులా అలా వెళ్ళిపోవడమేనా? అలా వెళ్ళినా తిరిగి ఇంటికి రావాలనేనా? ఇలాగే వుండనీయ్ వంటగది అనుకుని తలుపు దగ్గరగా లాగి హాలులోకి వచ్చి కూర్చుని టి.వి ఆప్ చేశాను.

టీవీలో ఒక్కో ప్రోగ్రాం అయిపోతూ వుంది గానీ శ్రీవారు వచ్చే జాడలేదు. గంట ఒకటి దాటింది. యేదో మళయాళ చిత్రం వస్తోంది టీవీలో. ఆ సినిమా చూసే ఓపిక లేదు. కడుపులో ఆకలి కరకర మంటుంది. టీవీ ఆఫ్ చేసి స్నానం చేసి వచ్చి కూర్చున్నాను.

గంట మూడయింది దొరగారి జాడలేదు.

నాలుగైంది. అయిదయింది. సాయంకాలమే కాదు రాత్రికీ ఇల్లు చేరలేదు ఏమిటీ విచిత్రం. నేను కాపురానికి వచ్చిన ఈ ఆరు సంవత్సరాల్లో యే ఒక్కరోజూ ఇలా జరగలేదు. ఇదే నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచినట్లుగా ఆ పేకాట పిచ్చిగాళ్ళ పని కట్టుకుని ఇంటికివచ్చి పిలుచుకువెళ్ళటం నాకు మరీ ఆగ్రహాన్ని పెంచసాగింది. ఆ వచ్చిన వాళ్ళ ఇంటికి వెళ్ళి దెబ్బలాడితే? ఛీఛీ సభంతగా వుంటుందా? యెన్ని అన్పించినా చివరికి యేమీ చేయలేని దాసిలా రాత్రి అంతా జాగారం చేస్తూ కూర్చున్నాను. ఆయనే గనక అర్ధరాత్రి వచ్చి తలుపుతడితే తలుపు తీయకుండా వాకిట్లో నిలబెట్టేయాలనుకున్నాను. నేను యెన్ని అనుకున్నా యేం జరగలేదు.

తెల్లవారింది.

అంటే నా డ్యూటీ ప్రారంభమైందన్నమాట. వంటగది శుభ్రం చేసుకుంటూ వుంటే యేడుపు రాసాగింది. నిన్నటి వుపవాసానికి నీరసం ముంచుకు రాసాగింది. అయినా పని చేయకతప్పదు గనుక యెలాగో శక్తి తెచ్చుకుని పనులన్నీ పూర్తిచేసుకున్నాను. వంటకూడా అయింది.

తొమ్మిదిన్నర అవుతుండగా దొరగారు వచ్చారు. చేతికి వాచీ వుందా లేదా అని చూశాను. వాచీ వుంది కానీ పెళ్ళికి నాన్నగారు పెట్టిన అర్ధతులం బంగారు వుంగరం లేదు. నెలఖర్చులకి బీరువాలో వుంచిన నాలుగువందలరూపాయలూ లేవని ముందే తెలుసు. కనుక నిశ్శబ్దంగా వుండిపోయాను.

ఆయన యెవరో తరుముకు వస్తున్నట్లుగా పనులు ముగించుకుని బట్టలు మార్చుకుంటూ వుంటే నేను రెడిగా వున్నాను.

"ఆఫీసుకి టైం అయింది వడ్డించు" అన్నమాట శ్రీవారినోటి నుంచి యెప్పుడు వస్తుందా అని యెదురు చూస్తున్నాను, యెంతకీ ఆ మాట విన్పించలేదు. గడియారంలోకి చూసి వులిక్కిపడి పడకగదివైపు చూశాను. శ్రీవారు ఆ గదిలోకాక వాకిలిగేటు దగ్గర కన్పించారు అంటే భోజనం కూడా చెయ్యకుండా ఆఫీసుకి వెళ్ళిపోతున్నారన్న మాట.

నన్ను పల్కరిస్తే ఏం జరుగుతుందో ఆయనకి తెలుసు కనుక ఆ అవకాశం నాకివ్వకుండా వెళ్ళిపోతున్నారు అంటే యెంత ధయిర్యం యెంత తెలివి?

నా ఇల్లు ఓ స్వర్గం అనుకుంటూ అహంభావం పోయింది. ఈ నయవంచకుడితో కాపురం చేస్తూనేనా?

నా రక్తం వుడికెత్తి పోసాగింది. చేతికి అందుబాటులో దొరికిన సామానులన్నీ విసిరి నేలకేసి కొట్టసాగాను ఇంతేకాదు ఇంకా ఇంకా యేవేదో చేసెయ్యాలి అన్పిస్తోంది మనసులో.

"వదినగారూ'' అంటూ పద్మాక్షి సరాసరి ఇంట్లోకి వచ్చింది కుంటుతూ నడుస్తూ.

"రండి" అన్నాను ఆవేశాన్ని యెంత కష్టం మీద అణుచుకుంటూ

"అన్నగారు వచ్చినట్లున్నారు'' అంది మెల్లగా.

"వచ్చారు వెళ్ళారు'' అని జరిగినదంతా చెప్పాను.

''వూ మా ఇంట్లోనూ డిటో'' నేను మౌనంగా వుండిపోయాను

''వదినగారూ ఇప్పుడే మహిళా సమాజంలో మీటింగ్ పెడదాం వస్తారా" అంది. వస్తాను అని బట్టలు మార్చుకుని ఇంటికి తాళం పెట్టి బయలుదేరారు. ఆవేశంలో ఆకలి సంగతి గుర్తులేదు.

నేనూ పద్మాక్షి సమాజానికి వెళ్ళేసరికి అప్పటికే అక్కడికి చాలా మంది వచ్చివున్నారు. ఇందరు భర్త బాధితులా" ఆశ్చర్యంగా హాలంతా కలియజూశాను. రంగురంగుల చీరెలు రకరకాల హెయిర్‌స్టైల్‌లో అందంగా కన్పిస్తున్న కొందరి ముఖాల్లో ఆవేశం కొందరి ముఖాల్లో నిర్లిప్తభావం మరి కొందరి ముఖాల్లో అమాయకత్వం ఇలా రకరకాలుగా కన్పించసాగారు నా కళ్ళకి.

నన్ను పద్మాక్షి సెక్రటరీకి ప్రెసిడెంట్‌కీ పరిచయం చేసింది. ఆ ఇద్దరూ నా రాకకి చాలా సంతోషాన్ని వ్యక్తపరుస్తూ మీలాంటి చదువుకున్నవాళ్ళు ఈ సమాజాలకి యెక్కువగా రావాలండీ'' అన్నారు.

చిన్నగా నవ్వి వూరుకున్నాను.

అనుకున్న టైముకి అర్ధగంట ఆలశ్యంగా మీటింగ్ ప్రారంభమైంది.

ప్రెసిడెంటూ శక్రటరీకాక మరో ఇద్దరు వుపన్యాసకులూ వేదికమీద కూర్చున్నారు. శక్రటరీ అందరికీ పూలదండలు వేసింది.

ప్రెసిడెంట్ మీటింగ్‌లో చర్చించవల్సిన విషయం చెప్పికూర్చుంది మొదటగా విమలాదేవి అనే ఆవిడ లేచి మైక్ దగ్గరకి వచ్చి పురుషాధిక్య సమాజంలో స్త్రీలు యెన్ని రకాల ఇబ్బందులని యెదుర్కుంటూన్నారో వుదాహరణలు ఇస్తూ అనర్గళంగా వుపన్యసిస్తూ ఆఖరున అంది. ఈ నిరంకుశత్వానికి పుల్‌స్టాప్ పెట్టేయించాలి. ఇందుకు మన స్త్రీలంతా కలిసికట్టుగా పోరాడాలి అని చెప్పి వెళ్ళి తన కుర్చీలో కూర్చుంది.

ఇంక విశాలాక్షిగారు లేచిమైక్ దగ్గరకి వచ్చి నిల్చున్నారు అంతే చప్పట్లు మార్మ్రోగాయి.

"ఆవిడ మాట్లాడకుండానే యేమిటి చప్పట్లు విసుగ్గా అన్నాను పద్మాక్షితో. పద్మాక్షి చిన్నగా నవ్వి.

"విశాలాక్షిగారిని గురించి మీకు తెలియదు. ఆవిడ మైక్ దగ్గరికి వచ్చిందంటే మగాళ్ళ మీద వాళ్ళ దురలవాట్లమీద విరుచుకుపడుతుంది. దుమ్ముదులిపేస్తుంది. ఇది స్త్రీలకి సంతోషం కదూ! అందుకూ ఈ చప్పట్లు అంది.

"ఏడిసినట్లుంది. మన ప్రాబ్లం పురుషద్వేషం కాదు కదా. పేకాటా రేసులూ వగైరా వ్యసనపరులని యెలా వారికి తెప్పుకోవటం అని కదా?

"ఔను అనుకోండి ఆ...ఆ అదిగో విశాలక్షిగారు మాట్లాడు తున్నారు నిశ్శబ్దంగా విందాం" అంది పద్మాక్షి.

విశాలాక్షి అసలు విషయం వదిలి వరకట్నాలు అత్తల కోడంటికాలా కోడళ్ళ బాధలూ వారి ఆత్మహత్యలూ అంటూ అర్థగంట మాట్లాడి చివరగా పురుషుల వసనాలవల్ల స్త్రీలు యెంతగా వ్యధలపాలు అవుతున్నారో వివరించి ఈ సమస్య ఈనాటిది కాదు యేనాటిదో అయినా యేనాటికీ అంతం లేకుండా సాగిపోతూ స్త్రీల మనసులని మండిస్తూంది కనుక దీనికి ఓ పరిష్కారం తప్పక వెతకాలి అంటూ మీరందరూ కల్సి నాతోరండి. శ్రీకృష్ణభగవాన్ లాంటి మన అన్నగారు వున్నారు. వారి దగ్గరికి వెళ్ళి మనం విన్నవించు కుందాం. ఉందుకు రేపే ఆయన్ని కల్సుకునే యేర్పాటు చేస్తాను" అనగానే అందరూ "అలాగే ఆలాగే" అన్నారు యేక కంఠంతో. అంతే అందరూ కుర్చీల్లోంచి లేచారు. నేనూ నీరసంగా ఇల్లు చేరాను.

* * * *

రాత్రి పదిగంటలు కావస్తుండగా శ్రీవారు ఇల్లు చేరారు. తలుపు తెరిచి ఆగ్రహంతో అడగవల్సినవన్నీ అడిగేశాను. ఆయన రాయిలా వులక లేదు పలకలేదు. బట్టలు మార్చుకుని డైనింగ్ టేబులు ముందున్న కుర్చీలో కూర్చుని తనే వడ్డించుకుని భోజనం చేసేశారు.

నువ్వు భోజనం చేసేవా అని అడుగుతారేమో అని యెదురు చూశాను. అలా అడిగితే సగం కోపం తగ్గిపోయేదినాకు ఆయన అలా

అడక్కుండా నువ్వేమిటి! నీలెక్కేమిటి అన్నట్లుగా పక్కబట్టలూ చాపా తీసుకుని వరండాలో వాటని పరుచుకుని కిందనించి పైకి ముసుగుపెట్టేశారు. అంటే ఇంక ఆయన చేత జవాబు చెప్పించటం ఆ బ్రహ్మదేవుడి చేత కూడా కాదు.

నన్ను నేను సమాధాన పర్చుకోవాలని యెంతో ప్రయత్నించ సాగాను సాధ్యం కావటంలేదు. నాకు నిద్రరావటంలేదు. నేను అన్న అడిగినా ఒక్కదానికి జవాబివ్వకపోవటం అంటే ఆడది యేం చేస్తుంది అన్న తక్కువ దృష్టి కదూ. ఈలాంటి పరిస్థితిలో నాకేగనుక ఆర్థిక స్వాతంత్ర్యం వుంటే 'నువ్వెంత' నన్ను గౌరవించని నిన్నూ నేను గౌరవించను అని ముఖాన కొట్టినట్లు ఈ ఇల్లు వదిలి బైటకిపోయి ఆత్మగౌరవం నిలబెట్టుకునే అవకాశం వుండేవి కదూ! ఈ మనిషినీ మాటలనీ నమ్మి నాకెందుకు వుద్యోగం అనుకుని ఆ అవకాశాన్ని జారవిడుచుకున్న నాకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇప్పుడెలా వస్తుంది. నాకే అలా చేయగల అవకాశం వుంటే ఈ దొరగారు దారిలోకి వచ్చి అవకాశం వుండేది కదూ. జీవితంలో మొట్ట మొదటిసారి తెల్సివచ్చింది. స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యం యెంత అవసరమో. మా సంపాదన లేకున్నా ఆడదాని అవసరం మగాడికి లేదూ? కోపంతో పళ్ళు కొరుక్కున్నాను. ఇలా కొరుక్కున్నందుకు నా పళ్ళే నొప్పిపుట్టాయి అయినా కోపంతగ్గలేదు నాకు.

రాత్రి అంతా అశాంతిగా గడిచిపోయింది. తెల్లవారింది కాఫీ తాగి స్నానం చేసి డ్రెస్ అయి.

మా తడాకా చూపిస్తాం వుండండి అన్నట్లుగా శ్రీవారివైపు కోపంగా చూసి పద్మాక్షిరాగానే మహిళా సమాజానికి బయలుదేరాను. రంగురంగుల పట్టుచీరెల్లో శీతాకోక చిలుకల్లా అలంకరించుకుని అప్పటకే అక్కడికి చాలామంది వచ్చి వున్నారు. అన్నగారికి బాధలు చెప్పుకోవటానికీ వెళ్ళినప్పుడు కూడా ఈ పట్టు చీరెలేమిటీ విసుగ్గా అనుకున్నాను. నేను కట్టుకున్న కలకత్తా కాటన్ చీరెవైపు చూసుకుంటూ.

"మీకేం తెలియదు వదినగారూ అన్నట్లు తన వెయ్యిరూపాయల కంచిపట్టుచీరె అంచులు సర్దుకుంటూ చూసింది పద్మాక్షి.

"అవును కాబోలు" అనుకున్నాను.

ఇంతలో తెల్లటి ఫియట్ కారు ఒచ్చి ఆగింది సమాజం బిల్డింగ్ ముందు. అందులోనించి విశాలాక్షిగారు నవ్వుముఖంతో దిగారు.

"ఇంక బయలుదేరదామా అన్నగారి దగ్గర ఇంటర్వ్యూ తీసుకునే వచ్చారా" అంది ప్రెసిడెంట్.

"ఆ ... విషయమే చెప్పబోతున్నాను. అందరూ వినండి. నిన్న నేను ఇక్కడనించి వెళ్ళిన తర్వాత చేతులు ముడుచుకు కూర్చోలేదు. అన్నగారి ఇంటర్వ్యూ కోసం ప్రయత్నంలో. అయితే అన్నగారి శక్రటరీ ఏం చెప్పారంటే రేపు అసలు అన్న గార్కి టైములేదనీ కావాలంటే ఓ అయిందు నిమిషాలు ఈరోజునే ఆయనకి చెప్పి యేర్పాటు చేయగలనీ చెప్పాడు అందువల్ల అంటూ విశాలాక్షి ఓ క్షణం ఆగింది. అప్పటికే అక్కడ చేరిన అందరూ ఒకరి చెవులని ఒకరు కొరుక్కోసాగారు. చూశారా. చూశారా గావిడెప్పుడూ ఇంతే మేర్బానీ అంతా ఆవిడే కొట్టేయాలని మనని అన్న ఊరిని కల్సుకోకుండా చేసింది. వుసూరుమనసాగారు తమ పట్టు చీరెలవైపు చూసుకుంటూ.

నిశ్శబ్దం. విశాలాక్షిగారు చెప్పేది పూర్తిగా వినండి ప్రెసిడెంట్ బిగ్గరగా అరిచింది.

విశాలాక్షిగారు చెప్పసాగారు.

"నేను యెంతో కష్టం మీద ఆయన్ని కలిశానా! ఆయన తన విలువైన సమయాన్ని నాకిచ్చారా...."

"అసలు విషయం చెప్పండి త్వరగా" అరిచారు యెవరో

"చెప్తున్నాను కదర్రా. అంత తొందరపడితే యెలా. ఆయన్నికలిసి మన ప్రాబ్లమ్స్ గురించి చెప్పాను. ఈ సమస్యయే కొందరి స్త్రీలదో కాదండీ ఆరుకోట్ల జనాభాలో సగభాగం అయిన స్త్రీలందరిదీ అంటూ ఇంకా చెప్ప బోతూంటే ఆయన వారించారు.

అర్థమయింది చెల్లెమ్మా ఈ సమస్య నా ఆడబడుచులది కనుక వెంటనే ఓ నిర్ణయం తీసుకుంటాను. యేమనంటే నా పాలనలో నా ఆడ బడుచులు నవ్వుతూ బ్రతకాలి. అంటే వారికి కష్టం కల్గించే యెవరినీ క్షమించను. మీరు చెప్పినట్లు మీ భర్తలు మీ మాట వినకపోతే ఆదివారం శలవు రద్దు చేయటమేకాదు, పేకాటకీ రేసులకీ బారులకీ వెళ్ళేవాళ్ళని పట్టిస్తే వాళ్ళ వుద్యోగాలనే వూడగొడతాదు. శనివారం శలవు రద్దుచేసినా వీళ్ళకి బుద్ధిరాలేదు కాబోలు అంటూ టైము అయిపోవటంతో ఆయన అక్కడనుంచి మరో హాల్లోకి వెళ్ళిపోయారు.

"నిజంగానా" అందరూ యేకకంఠంతో అడిగారు.

"నిజంగా నిజం" విశాలాక్షి గర్వంగా అంది.

'ఆడబడుచులకీ జై' అని ప్రెసిడెంట్ అనగానే అక్కడ చేరిన అందరూ జయజయధ్వానాలు చేశారు.

ఈ దెబ్బకి మగాళ్ళకి పట్టిన వ్యసనాల దయ్యాలనీచే పారిపోతాయి అంది శక్రటరీ.

విజయ గర్వంతో ఇళ్ళకి చేరుకున్నాం అందరం. ఇంటికి. తాళం వేసి వుంటుంది అనుకున్న నాకు పెద్ద షాకు తగిలింది. తలుపు బార్లా తెరిచివుండి, నా గుండె గుభేలుమంది. దొంగలన్నావచ్చి ఇంటిని దోచుకు పోలేదు కదా అనుకుంటూ అదిరే గుండెని అదిమి పట్టుకుని హాలులోకి వచ్చి ఓరగా వేసివున్న డ్రాయింగ్ రూము తలుపు ధడాలున దృశ్యాన్ని చూసి నిలువునా పీర్రై పోయాను. వూరునుంచి యెప్పుడు వచ్చాడో అన్నయ్యా

పద్మాక్షి మొగుడూ మా శ్రీవారు కూర్చుని పేకాడుతున్నారు.

నా తల తిరిగి పోసాగింది.

"ప్రభా వచ్చావా.... రారా.... నీ కోసమే కూర్చున్నాను. భోజనం చేద్దాంరా" వదిన నట్టింట్లోనించి రావటం మరీ ఆశ్చర్యం కల్గించింది.

"ఏమిటీ ఇలా హఠాత్తుగా వచ్చాం యెందుకనా! ఆ విషయం తర్వాత చెప్తాను, ఇంతకీ నువ్వు మహిళా సమాజానికి యెందుకు వెళ్ళినట్లూ

వుద్యోగం చేసి నెలకి రెండువేలు తెచ్చి అన్నయ్య చేతిలో పోయగల ఆర్థికశక్తివున్న వదిన ఇక్కడ వీళ్ళంతా అలా పేకాట ఆడుతుంటే తనకేం పట్టనట్లుగా ఇలా మాట్లాడటం నాకు పిచ్చియెక్కిపోయేలా చేసింది.

"వదినా?" అన్నాను ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేక.

ఆవిడ మొదట తెల్లబోయి ఆ తర్వాత అర్థమైనట్లు తలయెగలేసి పకపకా నవ్వేస్తూ "ఆ విషయమా తమ్ముడంతా చెప్పాడు. మేం రాగానే ఔను ఇంత చిన్న విషయానికి అంత సీరియస్ అవుతావెందుకనీ"

"ఇది చిన్న విషయమా?" అన్నాను ఇంకా కోపం యెక్కువై.

"అవును మిగతా వ్యసనాల విషయం నేను మాట్లాడను. కానీ యెప్పుడన్నా సరదాగా ఆడుకునే ఆ పేకాట వ్యసనంగా మారిపోతుందేమో అని భయపడటం వెర్రివాళ్ళు చేసేపని. అక్కడ మీ మీటింగ్‌లో యేమైందో అన్నగారు మీకందరికీ యేలాంటి అభయహస్తం ఇచ్చారో ఇంతకుముందే ఆ వార్త ఇక్కడికి చేరింది. అది విని వీళ్ళందరూ నవ్వుకుంటూన్నారు యెందుకో తెలుసా! చిన్న వ్యసనంవల్ల మగాడి వుద్యోగం వూడితే దానివల్ల నష్టపడేదీ కష్టపడేదీ యెవరు? కాస్త ఆలోచించి చెప్పు ప్రభా. ఆవేశంలో వున్న నువ్వు ఇప్పుడు చెప్పలేవు కానీ తన భర్త వుద్యోగం పోతుందని తెలిసిన యే ఆడదీ మా ఆయన వ్యసన పరుడు అంటూ ఫిర్యాదు చెయ్యదు. యెందుకంటే దాని పర్యవసానం తను భరించలేదు కనుక. అందుకనీ

నేచెప్పేమాట ఒకటి విను ప్రభా. మీ అన్నయ్య అలా పేకాడటం నాకు నచ్చలేదు. అలా అని ఈ విషయానికి ఆయనతో తగువుపడలేదు. ఆయన ఆ వ్యసనంలో హద్దులు దాటనంత వరకూ ఫర్లేదు ఆమో దిస్తాను. శృతిమించితే అవతల వాళ్ళు యేం అనుకుంటారో అన్న భయం లేకుండా ఆ ఫ్రెండ్స్‌ని మర్యాదగా మాట్లాడి పంపించేస్తాను ఇలాంటి చిన్నచిన్న సమస్యలని ఏ మనిషికామనిషి పరిష్కరించుకోవానిగానీ అన్నగారి దగ్గరికి పరుగెత్తితే ... వదిన ఆ వాక్యం పూర్తికానియ్యలేదు.

"ఆడబడుచులకీ జై అన్న" నినాదం చెవుల్లో అపహాస్యంగా ధ్వనిస్తోంది.

అడుగు కదపలేక అలాగే నిలబడిపోయాను.

"ఇంక చాలు ఆట ఆపేద్దాం లేవండి అరెరె ప్రభ వచ్చేసింది ఏమోయ్ నిర్మలా మాట్నీ ప్రోగ్రాం విషయం ప్రభకి చెప్పావా" అంటూ శ్రీవారి చెయ్యి పట్టుకుని నా దగ్గరగా వచ్చాడు అన్నయ్య.

(23-7-87 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)